www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక


విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -65 శుక్రవారం 19 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు..

### ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!



**తగ్గిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు**
**దీంతో దిగొచ్చిన ముడి చమురు ధరలు**
**రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం**
**వెంటనే సాధ్యం కాదన్న సురేశ్ గోపీ**
**ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు**
**అవి సద్దుమణిగాకే ధరల్లో సవరణకు అవకాశం**

**ఢిల్లీజూన్ 18,(ప్రజావినికిడి):** అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గవని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు. **మిగతా 2లో...**

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా




**: హైకోర్టుకు తెలిపిన కేంద్రం**
**నీట్ రీ-టెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం**
**నిషేధాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ హైకోర్టులో పిటిషన్**

**ఢిల్లీ జూన్ 18,(ప్రజావినికిడి):** మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'గా రూపాంతరం చెందిందని, సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదులు, పరీక్షల అక్రమాలకు పాల్పడే ముఠాలకు ఇది అడ్డాగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు విన్నవించింది. నీట్-యూజీ 2026 రీ-టెస్ట్ **మిగతా 2లో...**

# కాలుష్య రహిత నగరం నిర్మించి తీరుతా

**ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా**
**పేదల జోలికి వెళ్లకుండా..కబ్జాదారుల భరతం పడుతోంది**
**హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం**
**ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది**
**మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం**
**గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం**
**మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి**

**రంగారెడ్డి,జూన్ 18,(ప్రజావినికిడి):** ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు..**మిగతా 2లో...**



## శాంతి ఒప్పందంపై సంతకాలు



**ఫ్రాన్స్‌లో ట్రంప్-టెహ్రాన్‌లో పెజెష్కియాన్**
**నేడు అధికారికంగా సంతకాల కార్యక్రమం**

**జూన్ 18,(ప్రజావినికిడి):** మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు ఉద్దేశించిన శాంతి ఒప్పందంపై అమెరికా, ఇరాన్ అధ్యక్షులు సంతకాలు చేశారు. దీంతో ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరుస్తుంది. అదే విధంగా ఇరాన్ ఓడరేవులపై విధించిన దిగ్బంధాన్ని అమెరికా ఎత్తివేస్తుంది. ఇరాన్ పునర్నిర్మాణానికి 300 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందుతుంది. ఇరాన్‌పై విధించిన అన్ని రకాల ఆంక్షలను **మిగతా 2లో...**

## డిజిటల్ బాటలో తెలంగాణ కేబినెట్..




**ఇకపై సమావేశాలు పూర్తిగా పేపర్‌లెస్**
**తెలంగాణలో పేపర్‌లెస్ కేబినెట్ సమావేశాల ప్రారంభం**
**మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లు పంపిణీ చేసిన ప్రభుత్వం**
**పారదర్శకత, పాలనా సామర్థ్యం పెంచడమే లక్ష్యం**
**వ్యవస్థ పనితీరును స్వయంగా పరిశీలించిన సీఎం రేవంత్**

**జూన్ 18,(ప్రజావినికిడి):** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో మరో కీలక ముందడుగు వేసింది. మంత్రివర్గ సమావేశాలను ఇకపై పూర్తిస్థాయిలో 'పేపర్‌లెస్' (కాగితరహితం)గా నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'తెలంగాణ డిజిటల్ కేబినెట్' విధానాన్ని లాంఛనంగా ప్రారంభించింది. గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నూతన విధానానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి .**మిగతా 2లో...**

## నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

**వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి**
**మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి**
**వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం**

**హైదరాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):** రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు..**2లో...**



## మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

**నేడు ఎల్‌బి స్టేడియంలో విద్యార్థులతో ప్రమాణం**
**పాల్గొననున్న సిఎంరేవంత్, గవర్నర్ శుక్లా**

**హైదరాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):**తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యా వాతావరణం , మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉందని మరోసారి చాటిచెబుతూ, జూన్ 19న శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో రాష్ట్ర స్థాయి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి గారు రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు 'విద్యార్థి హక్కుల కిట్లు' పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం, వసతి సదుపాయాల కల్పనలో భాగంగా 20రకాల వస్తువులతో కిట్లు.**మిగతా 2లో...**





## జూన్ 30న రైతు భరోసా

**కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ఉత్తమ్**
**7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వనున్నట్టు వెల్లడి**
**నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మంత్రి**

**హైదరాబాద్ జూన్ 18,(ప్రజావినికిడి):** తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన కీలక కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీ వివరాలను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు."వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయించింది.**మిగతా 2లో...**

## లిక్కర్ స్కామ్ కేసులో కారుమూరి సునీల్ అరెస్ట్

**మాజీ మంత్రి కారుమూరి కుమారుడికి 14 రోజుల రిమాండ్**
**సునీల్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన ఈడీ**
**రూ.28 కోట్ల కిక్‌బ్యాకులు పొందినట్లు ఈడీ ఆరోపణ**
**ఈ స్కామ్ వల్ల ప్రభుత్వానికి రూ.195 కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా**



**హైదరాబాద్ జూన్ 18,(ప్రజావినికిడి):** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌కు హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల అనంతరం అధికారులు ఆయన్ను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. జూన్ 18న సునీల్ నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు.**మిగతా 2లో...**

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముషాయిరా**
**వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం**
**కొత్త స్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు**
**డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**
**సమావేశానికి హాజరైన మంత్రి హజారుద్దీన్ కార్పొరేషన్ చైర్మన్లు**

**హైదరాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):** రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ .**మిగతా 2లో...**



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# జూన్ 30న రైతు భరోసా

**మొదటిపేజీ తరువాయి**

జూన్ 30వ తేదీన మధిరలో నిర్వహించబోయే 'రైతు సమ్మేళనం' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను నేరుగా విడుదల చేస్తారు. మార్కెట్ డిమాండ్ మేరకు 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించింది" అని తెలిపారు.తెలంగాణ నుండి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడం సరికాదని అన్నారు.. ఎరువుల కోటా, రామగుండం యూరియాలో రాష్ట్రానికి సింహభాగం కేటాయింపు, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతులు, ఐఆర్ఎఫ్ సీ రుణాల విడుదలపై త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లనుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇకపై అంతా డిజిటల్ కేబినెట్ నిర్వహిస్తామన్నారు.

# పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు..

**మొదటిపేజీ తరువాయి**

ఇంధన ధరల నిర్ణయంలో ముడిచమురు ధరలతో పాటు రవాణా, సరఫరా, మార్కెట్ పరిస్థితుల వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు.తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని సురేశ్ గోపీ చెప్పారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రద్దీ ఎక్కువగా ఉండటంతో సరఫరా ప్రక్రియ సాధారణ స్థితికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అంతర్జాతీయ ధరలు తగ్గిన వెంటనే దేశీయ ఇంధన ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇటీవల గ్లోబల్ ఇంధన మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన భారం భరించిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ.12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు.

ఇంధన ధరలు పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నులను తగ్గించి ఆదాయాన్ని వదులుకోలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు చేరగా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 75 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. అయితే ఈ తగ్గుదల ప్రభావం దేశీయ ఇంధన ధరలపై కనిపించాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

**మొదటిపేజీ తరువాయి**

నేపథ్యంలో టెలిగ్రామ్‌పై విధించిన తాత్కాలిక నిషేధాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది.జూన్ 21న జరగనున్న నీట్ రీ-టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గత మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించడంతో పాటు, పరీక్షను రద్దు చేసి పునర్నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, 'నీట్ మాఫియా' వంటి టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా మళ్లీ అక్రమాలు జరగకుండా నిరోధించేందుకే జూన్ 22 వరకు ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది.టెలిగ్రామ్‌లోని ప్రైవసీ ఫీచర్లను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను గోప్యంగా ఉంచుతూ సులభంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఆరోపించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాల సరఫరా, ఉగ్రవాద ప్రచారం, సైబర్ దాడులు, ఆర్థిక మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు టెలిగ్రామ్ వేదికగా మారిందని పేర్కొంది. మరోవైపు, ప్రభుత్వ నిర్ణయం భారతదేశంలోని సుమారు 150 మిలియన్ల వినియోగదారుల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కొందరు నేరగాళ్ల చర్యల వల్ల వినియోగదారులందరినీ శిక్షించడం సరికాదని వాదించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, టెలిగ్రామ్‌కు ఎటువంటి తక్షణ ఊరట కల్పించలేదు. నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకే ఈ తాత్కాలిక చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

## లిక్కర్ స్కామ్ కేసులో కారుమూరి సునీల్ అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

తన తండ్రి పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆ పలుకుబడిని ఉపయోగించి మద్యం రవాణా కాంట్రాక్టుల ద్వారా సునీల్ భారీగా లబ్ధి పొందారని, తద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఈడీ ఆరోపిస్తోంది.విచారణ సందర్భంగా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన సందీప్, ప్రతాప్ రెడ్డిలతో సంబంధం ఉన్న సంస్థలకు కాంట్రాక్టులు అప్పగించడంలో భారీ అవకతవకలు జరిగాయని ఈడీ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఈ వ్యవహారంలో సునీల్ సుమారు రూ.28 కోట్ల మేర కిక్‌బ్యాకులు అందుకున్నారని, మరో రూ.7 కోట్ల విలువైన కుటుంబ లావాదేవీలను గుర్తించామని తెలిపారు. ఈ కుంభకోణం కారణంగా ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.195 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ అభియోగాలు మోపింది.వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా, పంపిణీ కాంట్రాక్టులలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించి ఈడీ గత కొంతకాలంగా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో సునీల్ కుమార్ అరెస్ట్ ఒక కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

అందజేస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలలను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులతో కలిసి 'మాదకద్రవ్య రహిత పాఠశాలలు / కళాశాలలు' లక్ష్యంతో సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించడం,

నివారణ చర్యలను బలోపేతం చేయడం, విద్యాసంస్థల్లో సురక్షితమైన, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యం. కార్యక్రమం లో దాదాపు 15వేల మంది విద్యార్థులు పాల్గొంటారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివిధ సంక్షేమ శాఖలు, విద్యా శాఖ సంబంధిత అధికారులకు కార్యక్రమ నిర్వహణకు అవసరమైన బాధ్యతలు కేటాయించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యా రంగ బలోపేతానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

# నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

**మొదటిపేజీ తరువాయి**

ఎస్సై బండి శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలంలో కిరాణా దుకాణం నిర్వహించే జాట్ రోహిత్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండ కొత్తపల్లికి చెందిన మధు.. టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తుండగా.. తెల్లవారుజామున జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సమీపంలోకి రాగానే ట్రక్కు టైరు పంక్చర్ అయింది. అదే దారిలో వెళ్తున్న లారీని ఆపి జాకీ తీసుకున్నారు. లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు డ్రైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్.. పంక్చర్ అయిన టైరును మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి-మురహరిపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అతి వేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కారులో నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. వికారాబాద్‌జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్‌పాషా (30) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు, డీసీఎం వ్యాన్ సిరిసిల్ల బైపాస్‌పై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిది జగిత్యాలగా తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# కాలుష్య రహిత నగరం నిర్మించి తీరుతా

**మొదటిపేజీ తరువాయి**

ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన




హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు.హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# డిజిటల్ బాటలో తెలంగాణ కేబినెట్..

**మొదటిపేజీ తరువాయి**

విక్రమార్కతో పాటు ఇతర మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారు.ఈ కొత్త విధానంలో భాగంగా, కేబినెట్ సమావేశాలకు సంబంధించిన అజెండా, నోట్స్ మరియు ఇతర అధికారిక పత్రాలను ముద్రించిన ఫైళ్ల రూపంలో కాకుండా డిజిటల్‌గా ట్యాబ్‌ల ద్వారానే అందుబాటులో ఉంచుతారు. ఈ వ్యవస్థ పనితీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. పరిపాలనలో సామర్థ్యం, పారదర్శకత, సుస్థిరతను పెంపొందించడంతో పాటు కాగితం వాడకాన్ని తగ్గించడమే ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశం. కాగా, ఈ సమావేశంలో కార్యదర్శులు లేదా ఇతర అధికారులు పాల్గొనలేదు.

పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఆగస్టు 2024లో ఈ-కేబినెట్ విధానాన్ని అమలు చేసిన దాదాపు రెండేళ్ల తర్వాత తెలంగాణ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. గతంలో 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో పేపర్‌లెస్ సమావేశాలు నిర్వహించగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. అనంతరం మరింత ఆధునిక వెర్షన్‌తో ఆ విధానాన్ని అక్కడ పునఃప్రారంభించారు.

జాతీయ సమాచార కేంద్రం (చీ×జ) సహకారంతో ఈ-గవర్నెన్స్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఈ డిజిటల్ కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాధికార ప్రక్రియ మరింత వేగవంతం మరియు సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# శాంతి ఒప్పందంపై సంతకాలు

**మొదటిపేజీ తరువాయి**

అమెరికా తొలగిస్తుంది. అయితే శాంతి ఒప్పందంలో ఇరాన్ అణు కార్యక్రమం ప్రస్తావన లేదు. దీనిపై కాల్పుల విరమణ అమలులో ఉండే 60 రోజుల కాలంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 సదస్సుకు హాజరైన సందర్భంగా ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఈ ఒప్పందం 'ఆర్థిక విపత్తు'ను తప్పిస్తుందని ఆయన చెప్పారు. అయితే ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరని పక్షంలో ఆ దేశంపై బాంబు దాడులు తప్పవని హెచ్చరించారు. శాంతి ఒప్పందంపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ బుధవారమే సంతకం చేశారని టెహ్రాన్ ధృవీకరించింది. అయితే అమెరికాపై తన అపనమ్మకం అలాగే ఉండిపోయిందని, టెహ్రాన్ వేలు ట్రిగ్గర్ పైనే ఉన్నదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ చెప్పారు. అమెరికా కనుక తన హామీలను నెరవేర్చని పక్షంలో తామూ వాటికి కట్టుబడి ఉండబోమని స్పష్టం చేశారు.

వర్సైల్లెస్ ప్యాలెస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఇచ్చిన విందు సందర్భంగా ఎంఓయూ హార్డ్ కాపీపై ట్రంప్ సంతకం చేశారు. ఆ సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆయన వెనకే నిలుచుని ఉన్నారు. ట్రంప్ సంతకం చేసిన ఒప్పంద పత్రాన్ని అధికారులు ఇరాన్‌కు పంపారు. దానిపై టెహ్రాన్‌లో పెజెష్కియాన్ సంతకం చేస్తుండగా తీసిన చిత్రాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా ఐఆర్ఎన్ఏ ప్రచురించింది. ఇరాన్ కోరిక మేరకు ఎంఓయూను ఆంగ్లంలోనూ, ఫార్సీ భాషలోనూ ముద్రించారు. 'సంతకం చేశాను' అని ట్రంప్ విలేకరులకు చెప్పారు. శాంతి ప్రణాళిక ప్రపంచవ్యాప్త మాంద్యాన్ని నివారిస్తుందని ఆయన తెలిపారు. జీ-7 సదస్సు జరిగిన ఎవియన్-లెస్-బెయిన్స్‌లోని రిసార్టులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక విపత్తును చూడాలని తాను అనుకోవడం లేదని చెప్పారు. యుద్ధం కొనసాగితే అదే సంభవించి ఉండేదని అన్నారు. 'నాకు తెలిసింది ఒక్కటే. మనం శాంతికి అవకాశాల గురించి మాట్లాడిన ప్రతిసారీ స్టాక్ మార్కెట్ రాకెట్ మాదిరిగా దూసుకుపోయింది. రాజీకి రాలేము వంటి ప్రతికూల విషయాలు చెప్పినప్పుడు మాత్రం అది భారీగా పతనమైంది' అని తెలిపారు. మాక్రాన్ ఇచ్చిన విందుకు హాజరైన అనంతరం ట్రంప్ వాషింగ్టన్ బయలుదేరారు.

**ఒప్పందంలోని అంశాలు ఇవే**

14 పాయింట్లతో కూడిన శాంతి ఒప్పంద పత్రాన్ని అమెరికా ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు విడుదల చేశారు. 'అమెరికా-ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం' పేరిట విడుదల చేసిన ఈ పత్రంలో హోర్ముజ్ జలసంధిని తెరవడం, ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలను తొలగించడం, తదుపరి సాంకేతిక చర్చలలో ఇరాన్ అణు కార్యక్రమం ప్రస్తావన వంటి కీలక అంశాలు ఉన్నాయి. 'హోర్ముజ్‌ను వెంటనే తెరవడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. అణు ధూళిని నాశనం చేయడానికి ఇరాన్ కట్టుబడి ఉండేలా చేస్తుంది. ఇరాన్ తన సత్ప్రవర్తనను మెరుగుపరచుకుంటే దానిని మరింత సంపన్న దేశంగా మార్చగలిగిన ఆర్థిక, ఆంక్షల ఉపశమనాన్ని అందించడానికి మాకు అవకాశం ఇస్తుంది' అని అమెరికా అధికారి తెలిపారు. ఒప్పంద పత్రంపై నేడు అధికారికంగా సంతకాలు జరుగుతాయి. ఒప్పందం యొక్క తుది నిబంధనలపై చర్చలు జరపడానికి నిర్దేశించుకున్న 60 రోజుల గడువు కూడా నేడే ప్రారంభం అవుతుంది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణను పొడిగిస్తుందని అమెరికా అధ్యక్షభవనం అధికారి ఒకరు చెప్పారు. ఇది 'పనితీరు ఆధారిత' ఒప్పందమని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. కాగా ఒప్పందంలోని అంశాలు ఇలా ఉన్నాయిడ.

# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మొదటిపేజీ తరువాయి**

అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా



పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా, 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కోరగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రెటరీ సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఉన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

శుక్రవారం 19 జూన్ 2026

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి..

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..






**శంషాబాద్,(ప్రజావినికిడి):** ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా,వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామంలో
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి వన మహోత్సవం కార్యక్రమాన్ని గురువారం అటవీశాఖ అధికారులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, అటవీ శాఖ అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వయంగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా,వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి,దండు ఇస్త్రారి,గడ్డం శేఖర్ యాదవ్,శివాజీ, యాదగిరి రెడ్డి, గొపాల్,బిక్షపతి,కే బిక్షపతి,ప్రభాకర్, మహేందర్, శ్రీనివాస్,వివిధ గ్రామాల సర్పంచులు,వార్డు సభ్యులు, అధికారులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేశంపేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జ్యోషి..






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జ్యోషి గురువారం రంగారెడ్డి జిల్లా కేశంపేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఇందులో భాగంగా స్టేషన్ రికార్డులు,పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి,స్టేషన్ పరిశుభ్రత,శాంతిభద్రతల నిర్వహణ,నేరాల నియంత్రణ చర్యలు ప్రజలకు అందిస్తున్న సేవలు అదేవిదంగా సిబ్బంది పనితీరును సమీక్షించారు.అనంతరం పోలీసు అధికారులు అలాగే సిబ్బందికి కమిషనర్ పలు కీలక సూచనలు చేశారు.ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని,శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.అలాగే సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం,మహిళలు,పిల్లల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం,గ్రామస్థాయిలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రతను పాటిస్తూ,ప్రజలకు పారదర్శకమైన,సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలని కమిషనర్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత డీసీపీ,ఏసీపీ,స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బైక్ ర్యాలీ




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా షాద్ నగర్ పట్టణంలో పతంజలి యోగా శిక్షణ కేంద్రాల వ్యవస్థాపక అధ్యక్షులు పానుగంటి శశిధర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం షాద్‌నగర్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ప్రధాన యోగా కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ర్యాలీలో పాల్గొన్న యోగా సాధకులు,యువత ప్రతి ఒక్కరూ యోగా చేయండి ఆరోగ్యంగా ఉండండి.అనే నినాదాలతో ప్రజలకు యోగా ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా పానుగంటి శశిధర్ మాట్లాడుతూ,జూన్ 21న నిర్వహించనున్న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ ప్రజలు,యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి

**ముషీరాబాద్, (ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలను తక్షణమే పరిష్కరించి,పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
సీపీఎం హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన జాన్ వెస్లీ,అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల కోసం 2021లో ప్రారంభించిన అదనపు భవన నిర్మాణం నేటి వరకు పూర్తి కాకపోవడం ఆందోళనకరమన్నారు. పాఠశాలలో సుమారు 800 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ



బాధ్యతలను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించినప్పటికీనాణ్యమైన ఆహారం అందించడం లేదని ఆయన విమర్శించారు. సరైన బియ్యం, నాణ్యమైన పదార్థాలు ఉపయోగించకపోవడంతో విద్యార్థులు పాఠశాల భోజనాన్ని వదిలి ఇంటి నుంచి భోజనం తీసుకువస్తున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.ఒకవైపు ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని ప్రచారం చేస్తుండగా, మరోవైపు కనీసం నాణ్యమైన మధ్యాహ్న భోజనం కూడా అందించలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని జాన్ వెస్లీ అన్నారు.
పాఠశాలలు ప్రారంభానికి ముందే యూనిఫామ్‌లు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫామ్‌లు అందలేదని,అన్ని సబ్జెక్టులకు తగినంత మంది ఉపాధ్యాయులు కూడా లేరని తెలిపారు.ఈ సమస్యలను పరిష్కరించకుండా విద్యా ప్రమాణాలు మెరుగుపడవని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించకుండా కేవలం ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహార భోజనం, యూనిఫామ్‌లు, తగిన ఉపాధ్యాయులు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం దశరథ్, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్ వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్,అశోక రెడ్డి, నాగేందర్, రజనీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో విజ్మోని 37వ బ్రాంచ్ సంస్థ ప్రారంభం..

### జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన మేనేజర్ టి. శ్రీనివాస్ రెడ్డి..






**శంషాబాద్, (ప్రజావినికిడి): జూన్18,** శంషాబాద్‌లో విజ్మోని సంస్థ తన విస్తరణలో మరో మైలురాయిని చేరుకుంది. దేశవ్యాప్తంగా ఆర్థిక,ట్రావెల్ సేవలను అందిస్తున్న విజ్మోని సంస్థ 37వ బ్రాంచ్‌ను శంషాబాద్‌లో ఘనంగా ప్రారంభించింది.ఈ కొత్త బ్రాంచ్‌ను ఏపీ-తెలంగాణ జోనల్ మేనేజర్ టి.శ్రీనివాస్ రెడ్డి రీజినల్ హెడ్ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులకు ఒకే చోట గోల్డ్ లోన్,ఫారిన్ కరెన్సీ ఎక్స్చేంజ్,ట్రావెల్ కార్డులు, విదేశాలకు నగదు పంపిణీ,ట్రావెల్ & హాలిడే ప్యాకేజీలు, మనీ ట్రాన్స్‌ఫర్, యుటిలిటీ పేమెంట్స్, ఇన్సూరెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.కస్టమర్ల సంతృప్తి పరదర్శకత వంటి వేగమంతమైన సేవలు వీజ్మోని ద్వారా కస్టమర్లకు విదేశీ కరెన్సీ మార్పిడి విదేశాలకు డబ్బు పంపే సౌకర్యం ఉన్నత విద్య కోసం విద్యార్థులకు లోన్ సౌకర్యం ఫారెక్స్ ట్రావెల్ కార్డ్స్ సేవలు హాలిడే ప్యాకేజీలు బంగారం పై అతి తక్కువ వడ్డీ తక్కువ వడ్డీతో రుణాలు వంటి సేవలు అందిస్తుందని అన్నారు.శంషాబాద్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా తొండు పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ బుక్స్,వాటర్ ప్యూరిఫైయర్ పంపిణీ చేశారు. బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రీజనల్ హెడ్ రాజు,స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# తలకొండపల్లిలో ఉప్పల బాలికల ఆశ్రమ పాఠశాల ప్రారంభోత్సవం

### ప్రారంభించిన మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్,లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, శేషరెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసి మరియు మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఏర్పాటు చేసిన ఉప్పల బాలికల ఆశ్రమ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్,లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్,శేషారెడ్డి తదితరులు పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సి నవీన్ రెడ్డి మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధికి ఇటువంటి విద్యాసంస్థలు ఎంతో దోహదపడతాయని విద్యా, సామాజిక రంగాల్లో ఆయన చేస్తున్న కృషి సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఉప్పల వెంకటేష్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రశంసించారు.
ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి కోసం ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.
ఉప్పల వెంకటేష్ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ ప్రారంభోత్సవంలో మాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ హరి నాయక్,షాద్ నగర్ ప్రముఖులు మలిపెద్ది శంకర్,సంగేమ్ గోపాల్ రెడ్డి,కల్వకుర్తి మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపిపీలు,సర్పంచులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**ప్రజా పోరాట సమితి డిమాండ్**

**సమస్యలపై సోమవారం గ్రీవెన్స్ డే లో వినతి పత్రం**

**ఇళ్లు ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు**

**వాజేడు,జూన్ 18,(ప్రజావినికిడి):**
వాజేడు మండలం పరిధిలోని అర్హులైన పేదలు అందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రజా పోరాట సమితి డిమాండ్ చేసింది. వాజేడు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజల విన్నపం మేరకు, ధర్మవరం గ్రామంలో ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా ప్రజా పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా ఎంతో మంది నిరుపేదలు సొంత ఇల్లు లేక, కనీస వసతులు లేని గుడిసెల్లో, మట్టి ఇళ్లల్లో అత్యంత దీనస్థితిలో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం



ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం రాజకీయ సిఫార్సులకే పరిమితం కాకుండా, నిజమైన అర్హులకు అందాలని వారు డిమాండ్ చేశారు.

**సోమవారం గ్రీవెన్స్ డే లో లబ్ధిదారుల జాబితా**

సొంత ఇల్లు లేని వారు,ప్రస్తుతం గుడిసెలు, మట్టి ఇళ్లలో నివసిస్తున్న వారు తమ దరఖాస్తులతో పాటు,తాము ఉంటున్న ఇంటి ఫోటో జిరాక్స్ కాపీలను ప్రజా పోరాట సమితి ప్రతినిధులకు అందజేయాలని కోరారు.ఇళ్లు లేని ప్రతి గ్రామానికి స్వయంగా వెళ్లి, క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారి పూర్తి వివరాలతో కూడిన సమగ్ర జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ జాబితాను రాబోయే సోమవారం నాడు కలెక్టరేట్ లో జరిగే గ్రీవెన్స్ డే (ప్రజావాణి) లో అధికారులకు అందజేస్తామని స్పష్టం చేశారు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించినా,లేదా రాజకీయం చేసినా సహించేది లేదు. అర్హులకు న్యాయం జరగకుంటే రాబోయే రోజుల్లో ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతాం.అని ముత్తెబోయిన మహేందర్ (ప్రజా పోరాట సమితి అధ్యక్షులు)
ఈ కార్యక్రమంలో ప్రజా పోరాట సమితి ఉపాధ్యక్షులు గార రవికుమార్, ముఖ్య నాయకులు కుమ్మరి శ్రీనాథ్, గగ్గూరి నాగేంద్రబాబు, ఇతర ప్రతినిధులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును తెలిపారు.

# పలకపై అక్షరాలు దిద్దుతూ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన చౌదర్ గూడ ఉప సర్పంచ్ సంతపురి ప్రేమ్ రాజ్..





**శంషాబాద్,(ప్రజావినికిడి): జూన్ 18,** మండల పరిధిలోని చౌదర్ గూడ గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాల అంగన్వాడి కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ఉపసర్పంచ్ ఎస్ ప్రేమ్ రాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో విద్యాభ్యాసిస్తున్న చిన్నారులకు అక్షరాభ్యాసం ఉప సర్పంచ్ చేతుల మీదుగా పలకపై అమ్మ ఆవు అంటూ దిద్దుతూ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు స్కూల్ డ్రెస్, బుక్స్, పెన్సిల్, పలక వంటివి ఉప సర్పంచ్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులుగా ఉన్నతమైన శిఖరాలకు చేరాలని ప్రభుత్వ పాఠశాలలోని అనుభవం గల ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్య అందుతుందని కావున గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తాళ్ల జయమ్మ, మల్చలం మంజుల జంగయ్య, బక్క రాజు, బక్క సుజాత సుధాకర్, మామిళ్ళ సబితా మల్లేష్ యాదవ్, కుమ్మరి అరుణ పెంటయ్య, మోహన్ రావు, అంగన్వాడి టీచర్లు ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న అమరవీరుల స్తూపం..

## పరిశీలిస్తున్న షాద్ నగర్ తాలూకా జేఏసీ నాయకులు..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్రం సిద్ధించడానికి తొలి దశ మలిదశ ఉద్యమంలో ఎంతోమంది అమరులైన సందర్భంగా, వారి స్మారకార్థం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో షాద్ నగర్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన అమరవీరుల స్తూపం చివరి దశలో ఉన్నందున, ఆ యొక్క నిర్మాణ పనులను జేఏసీ నేతలు పరిశీలించడం జరిగింది. అతి త్వరలోనే అమరవీరుల స్తూపం ఆవిష్కరిస్తామని, ఉద్యమకారులు మరియు అమరవీరుల కుటుంబాల సమక్షంలో ఆ తేదీని వెల్లడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మూలే జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, జేఏసీ కన్వీనర్ నక్క బాల్ రాజ్ యాదవ్, రాష్ట్ర పంచాయతీరాజ్ జనరల్ సెక్రెటరీ బాదేపల్లి సిద్ధార్థ, టీఎన్జీవో అధ్యక్షుడు జక్కుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

## 11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం

## జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం



**హైదరాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# యూరియా యాప్ తొలగించాల్సిందే

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):** యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దుకాణాల్లో లేని యూరియా బస్తాలు యాప్ ద్వారా ఎలా రైతులకు అందుతాయని ప్రశ్నించారు. యాప్ వల్ల గ్రామాల్లో రైతులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అందుకే యూరియా యాప్ తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతులకు ఎరువులు సకాలంలో పథకాలు అందించడంతోపాటు రైతు సంక్షేమం కోరిందని గుర్తు చేశారు.

# పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు

## ఎంతటి వారైనా పార్టీకి కట్టుబడి ఉండాల్సిందే

## క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి

**హైదరాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):** ఎంతటి వారైనా సరే వారి వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్ద వద్దని నేతలకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే.. వాటిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేకుంటే రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని నేతలకు ఆయన సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరవుతారన్నారు. కామారెడ్డిలో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు. షబ్బీర్ ఆలీకి నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆదివారం కమిటీ ముందు హాజరు కావాలని ఆయనకు సూచించామన్నారు. అందుకు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముందుగా షబ్బీర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదుపై క్రమశిక్షణ కమిటీ చర్చిందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని మల్లు రవి వెల్లడించారు. పార్టీ వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించిన క్రమశిక్షణ కమిటీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని నేతలకు ఎంపీ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. పార్టీ క్రమశిక్షణ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కలిసి అన్ని విషయాలు వివరించానని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. నోటీసులపై లిఖిత పూర్వక సమాధానం ఇచ్చానన్నారు. అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆయన్ని కోరినట్లు చెప్పారు. వారం రోజుల్లో అన్ని అంశాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి తెలిపారని చెప్పారు. కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారని వివరించారు.

--------------

# నేరేడు పండ్లు మనల్ని ఏమి హెచ్చరిస్తున్నాయి..?






**జూన్ 18,(ప్రజావినికిడి):**

ఈ ఏడాది మార్కెట్లలో నేను గత ముప్పై సంవత్సరాల్లో ఎప్పుడూ చూడనంతగా నేరేడు పండ్లు కనిపిస్తున్నాయి.

చెట్ల నుంచి పండ్లు అక్షరాలా కురుస్తున్నాయి. గత సంవత్సరం కొద్దిపాటి పండ్లు మాత్రమే కాసిన చెట్లు కూడా ఈసారి విపరీతంగా పండ్లు కాస్తున్నాయి. ఇప్పటికే ఎక్కువ పండ్లు కాసే చెట్లు అయితే మరింత భారీగా పండ్లను రాలుస్తున్నాయి.

### అసలు ఇలా ఎందుకు జరుగుతోంది?

**మా అమ్మమ్మ ఒక మాట చెప్పేది:**

"వేసవిలో నేరేడు చెట్లు ఇంతగా పండ్లు రాలిస్తే, ఆ సంవత్సరం కరువు వచ్చే అవకాశాలు ఎక్కువ."

ఆశ్చర్యకరంగా, శాస్త్రం కూడా ఈ సంప్రదాయ జ్ఞానాన్ని చాలావరకు సమర్థిస్తుంది. వృక్ష శాస్త్రంలో ఈ పరిస్థితిని "మాస్టింగ్ లేదా "స్ట్రెస్ ఫ్రూటింగ్ అంటారు. అంటే, చెట్టు తన మనుగడకన్నా ఎక్కువగా పండ్లు, విత్తనాలు ఉత్పత్తి చేయడంపై దృష్టి పెట్టే పరిస్థితి. దీనిని కొందరు "సూసైడ్ ఫ్రూటింగ్" లేదా "బంపర్ క్రాప్" అని కూడా పిలుస్తారు.

**1.జాతి మనుగడ కోసం ప్రకృతి ప్రయత్నం**

చెట్టు భూగర్భ జలాలు తగ్గుతున్నాయని లేదా వాతావరణంలో పెద్ద మార్పులు రాబోతున్నాయని గుర్తించినప్పుడు, అది ఒక రక్షణ చర్యలోకి వెళుతుంది.

"నేను భవిష్యత్తులో బతకలేకపోవచ్చు" అని చెట్టు భావించినట్లుగా, తన శక్తినంతా విత్తనాలు (పండ్లు) ఉత్పత్తి చేయడంలో పెట్టుబడి పెడుతుంది. తద్వారా తన జాతి కొనసాగుతుందని ప్రకృతి నిర్ధారిస్తుంది.

**2.కొత్త పెరుగుదలను తగ్గించడం.**

ఇలాంటి సంవత్సరాల్లో చెట్లు కొత్త కొమ్మలు, చిగుర్లు తక్కువగా వేయవచ్చు లేదా పూర్తిగా ఆపేయవచ్చు.

ఎందుకంటే కొత్త ఆకులు, కొమ్మలు పెరగడానికి ఎక్కువ నీరు, పోషకాలు అవసరం. అందుకే చెట్టు తన శక్తిని ఆదా చేసి, ఎక్కువ పండ్లు కాయించడంపైనే దృష్టి పెడుతుంది.

దీని వల్లే గత సంవత్సరం తక్కువ పండ్లు కాసిన చెట్లు కూడా ఈసారి పండ్లతో నిండిపోతాయి.

**3.అమ్మమ్మ మాట వెనుక ఉన్న శాస్త్రం.**

అమ్మమ్మల పరిశీలనలు చాలాసార్లు ప్రకృతిని దగ్గరగా గమనించడం వల్ల వచ్చినవే.

నేరేడు చెట్టుకు చాలా లోతుగా వెళ్లే వేర్లు ఉంటాయి. భూగర్భ జలమట్టం బాగా తగ్గినప్పుడే ఆ వేర్లకు నీటి కొరత అనిపిస్తుంది.

ఈ నీటి ఒత్తిడి చెట్టుకు ఒక హెచ్చరిక సంకేతంగా పనిచేస్తుంది.

అందువల్ల వేసవిలో నేరేడు చెట్లు అసాధారణంగా ఎక్కువ పండ్లు కాయించి రాలిస్తే, అది రాబోయే ఎండలు లేదా నీటి కొరతకు ప్రకృతి ఇచ్చే సూచన కావచ్చు. నేరేడు చెట్టు ఆత్మహత్య చేసుకోవడం లేదు. తన తరువాతి తరాలు బతికేలా విత్తనాల రూపంలో ఎక్కువ సంతానాన్ని సృష్టించేందుకు చివరి వరకు ప్రయత్నిస్తోంది.


ప్రకృతి చక్రం నిజంగా అద్భుతమైనది. మన పెద్దలు తరతరాలుగా గమనించి చెప్పిన విషయాలు, ఆధునిక శాస్త్రం చెప్పే విషయాలతో చాలాసార్లు సరిపోతుంటాయి.

కాబట్టి ఈ ఏడాది నేరేడు పండ్ల సమృద్ధిని ఆనందించండి. కానీ ప్రకృతి ఇస్తున్న ఈ హెచ్చరికను కూడా గమనించండి.

నీటిని పొదుపుగా వాడండి. ప్రకృతి వనరులను బాధ్యతగా వినియోగించండి. అదే భవిష్యత్ తరాలకు మనం ఇవ్వగలిగే గొప్ప బ హుమతి.

# రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

## అందులో 5 ఎకరాలు తమవేనంటూ ఎస్‌బిఐ పిటిషన్ -కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు



**హైదరాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):** హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి ఇటీవల వేలం నిర్వహించారు. ఈ స్థలాన్ని ఎకరాకు రూ.237కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక్ ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. సర్వే నెంబర్ 83/1లోని 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాయదుర్గం భూముల వేలంపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలోని పన్మక్తలో టీజీఐఐసీ జరిపిన భూముల వేలంపై ఇటీవల ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. ఇటీవల జరిగిన వేలంలో అక్కడ ఎకరం రూ.237 కోట్లు పలికిన సంగతి తెలిసందే. సర్వే నం.83/1లో ఐదు ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. మే 6న జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌తోపాటు తదనంతరం జరిగిన భూ విక్రయాన్ని, తమ వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ మే 20న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఎస్‌బీఐ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. రాయదుర్గంలో ఎస్‌బీహెచ్‌కు 2010లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఇందుకోసం రూ.13.33 కోట్లను చెల్లించింది. ఎస్‌బీఐలో ఎస్‌బీహెచ్ విలీనం కాగా, గతంలో ఈ స్థలంలో ఉన్న రెండు ఏటీఎంలను ఎస్‌బీఐ నిర్వహిస్తోంది. 2020లో గత ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయగా ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ.. ఎస్‌బీఐ అభ్యర్థనను పునఃపరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం 2024లో ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ కేటాయింపును రద్దు చేయడంతో ఎస్‌బీఐ మరోసారి హైకోర్టును ఆశ్రయించింది.

# ఆధార్ కార్డు ఐడెంటిటీకి మాత్రమే పరిమితం చేయాలి

## పౌరసత్వం, నివాస ధృవీకరణ తదితరాలకు వాడరాదు

## పిటిషన్‌పై సుప్రీం విచారణ



**న్యూఢిల్లీ,జూన్ 18,(ప్రజావినికిడి):** ఆధార్ కార్డు వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది ఆధార్ కార్డులను పౌరసత్వం, నివాసం, అడ్రస్ ధృవీకరణకు ప్రూఫ్ గా వాడుతున్నారని, ఇది కేవలం ఐడెంటిటీ వెరిఫికేషన్ కు మాత్రమే పరిమితం చేయాలని దాఖలైన పిటిషన్ ను విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటను స్పందించాలని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసం, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్ ను విచారించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్ గా మాత్రమే వాడాలని పౌరసత్వం, నివాసం, అడ్రస్, పుట్టిన తేదీకి సంబంధించిన రుజువుగా వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర, ఎన్నికల సంఘాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్. ఓటరు నమోదుకు బర్త్ డేట్, రెసిడెంట్ ప్రూఫ్ లకు ఆధార్ కార్డును వినియోగిస్తున్నారని, ఇది ఆధార చట్టానికి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 'ఆధార్ పౌరసత్వానికి లేదా రెసిడెంట్ కు ప్రూఫ్ కాదని స్పష్టంగా తెలిపింది ఉడాయ్. అయినప్పటికీ, ఆధార్‌ను స్కూల్ అడ్మిషన్లు,ప్రాపర్టీ కొనుగోలు, బర్త్ ప్రూఫ్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం వయస్సు, పౌరసత్వం, నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించడమే కాకుండా, కొత్త ఓటరు నమోదుకు, పుట్టిన తేదీకి, నివాస ధృవీకరణ పత్రంగా కూడా వాడుతున్నారు. ఈ విధంగా, చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ డాక్యుమెంట్లను పొందుతున్నారని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలలో ధృవీకరణ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాలని, సంస్కరణలను పర్యవేక్షించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

# సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

## కేసముద్రం మార్కెట్లో పెరిగిన కొనుగోళ్లు

**మహబుబాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):** సన్న ధాన్యానికి మద్దతు పెరుగుతోంది. మార్కెట్లలో మద్దతు ధరలను మించి ధరలు పెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈయేడు సరిగా పంటలు పండకపోతే ధరలు పెరుగుతాయన్న భావనలో వ్యాపారులు ఉన్నారు. మహబుబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ధాన్యం ధర ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.2,906 నమోదైంది. గత 15 రోజులుగా ఈ మార్కెట్‌లో ఆర్ఎన్ఆర్ రకం వడ్లరేట్ రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక మార్కెట్‌కు ఈ– వేలం'లో క్వింటాకు గరిష్ఠంగా రూ.2,906, కనిష్ఠంగా రూ.2, 226, సగటున రూ.2,589 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,389 ఉండగా, ఈ సీజన్‌లో అంతకంటే ఎక్కువగానే మార్కెట్లో ధరలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉంటాయనే కారణాలతో వ్యాపారులు నిల్వ చేసేందుకు మార్కెట్లో ధాన్యం ఖరీదులు పెంచారు. ఈ క్రమంలో దేశీయంగా ధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో మార్కెట్లో ఈ సీజన్‌లో గత 15 రోజులుగా ధాన్యం సగటు ధర పెరుగుతూ వస్తోంది. ఈ నెల 1న ధాన్యం సగటు ధర రూ.2,475 నుంచి రూ.2,495 వరకు ఉన్నాయి. ఆ తర్వాత ఈనెల 4న సగటు ధర రూ.2, 589, 5న రూ.2636, 8న రూ.2,689, 9న రూ.2,729గా నమోదయ్యాయి. తాజా గా గరిష్ఠ ధర రూ.2,900 మార్కు దాటడం విశేషం.

# హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

## నేడు ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్



**హైదరాబాద్,జూన్ 18,(ప్రజావినికిడి):** నగరంలో జనసేన తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12.00 గంటలకు మల్కం చెరువు సమీపంలోని పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఈ నూతన కార్యాలయంతో తెలంగాణలో పార్టీ విస్తరణకు పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే రాష్ట్రంలోని జనసైనికులు, వీరమహిళలు, నాయకులకు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి భారీగా జనసైనికులు తరలి వస్తారని నేతలు అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన కార్యకలాపాలకు ఈ నూతన కార్యాలయం కేంద్రంగా మారనుందనే ప్రచారం సాగుతోంది. ఈ కొత్త కార్యాలయం ఏర్పాటు తర్వాత.. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, చేరికలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోకస్ చేస్తారని తెలుస్తోంది.

# పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

## కెటిఆర్ సిరిసిల్లకు విజిటింగ్ టూరిస్ట్ -టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు



**కరీంనగర్,జూన్ 18,(ప్రజావినికిడి):** ప్రాంతీయవాదాన్ని వేర్పాటువాదంతో పోల్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసు పెట్టలేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. కేసు పెట్టడం చేతగాని ప్రభుత్వం తెలంగాణలో ఉందని విమర్శించారు. కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని ప్రాధాన్యత లేని అంశంగా భావిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ప్రజల త్యాగాలను అవమాన పరిచినట్లేనని కవిత అన్నారు. ఇకపోతే మాజీమంత్రి కేటీఆర్‌పై కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత పేర్కొన్నారు.

# పారిశ్రామిక ఫలాలు పేదలకు చేర్చాలి

## 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు: సీఎం చంద్రబాబు



**అమరావతిజూన్ 18,(ప్రజావినికిడి):** పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో

రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు.

ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు.

**ఇథనాల్, సెమీ కండక్టర్లకు పెద్దపీట**

ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు.

అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లీథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు–పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు.

**ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేశ్**

ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు.

స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'

## : మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు



**అమరావతిజూన్ 18,(ప్రజావినికిడి):** రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

**మౌలిక వసతులు, విద్యార్థి కిట్లపై ప్రత్యేక శ్రద్ధ**

రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

**అనాథ పిల్లలకు 'తల్లికి వందనం' భరోసా**

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, వారి ద్వారా పిల్లలకు చేరేలా చూడాలన్నారు.

అంతేకాకుండా, అనాథ పిల్లల పేరుపై బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం నిధులను నేరుగా జమ చేయాలని సూచించారు. వారి చదువు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని వారు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ఇది వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా ఇస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

**అభ్యసన సామర్థ్యాల పెంపు, తెలుగు భాషకు ప్రాధాన్యం**

పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువమంది విద్యార్థులు గణితం, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్నారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన లోకేశ్, ఎట్టి పరిస్థితుల్లోనూ మాతృభాష తెలుగును విస్మరించవద్దని, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు తరగతులు నిర్వహించాలన్నారు.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

- జులై 3నాటికి ప్రక్రియ పూర్తి కావాలి
- ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఉండాల్సిందే
-సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా మార్చండి
-అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష
ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్



**అమరావతిజూన్ 18,(ప్రజావినికిడి):** రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. జులై 3వ తేదీ నాటికి ఈ సొసైటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు.గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియామకాలు, విధివిధానాల ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025కి అనుగుణంగానే ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, ఎలాంటి కాలయాపన చేయకుండా సొసైటీ త్వరగా కార్యరూపం దాల్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా పంచాయతీలో ఏర్పాటు సాధ్యం కాకపోతే, కనీసం మూడు, నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీ ఉండేలా వెంటనే పనులు ప్రారంభించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'వీబీ–జీ రామ్ జీ' పథకం కిందకు నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాం. ఈ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా ఉపయోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి" అన్నారు.

**ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లండి**

పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి తెలిపారు. ఈ వర్షాకాలంలోనే వీటిని అటవీ, ఖాళీ ప్రాంతాలలో వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండ కోనల్లో విత్తనాలను చల్లడానికి ఈసారి సుమారు 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళికపై స్పందించిన పవన్ కళ్యాణ్ గారు, సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకొని దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**అరుదైన మొక్కల సంరక్షణపై అభినందనలు**

రాష్ట్రంలో అంతరించిపోతున్న అరుదైన వృక్ష జాతులను రక్షించేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై శ్రీ పవన్ కళ్యాణ్ గారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులైన పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ లను, వాళ్ల బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పాములేరు వాగు వెంబడి కేవలం 10 మాత్రమే మిగిలి ఉన్న అత్యంత అరుదైన, అంతరించిపోతున్న వెదురు జాతిని అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో చేసిన లోతైన పరిశోధనలు, ఆధునిక మాలిక్యులర్ సైన్స్ ద్వారా ఈ కొత్త జాతిని గుర్తించారు. దీనికి 'బాంబూసా ఆంధ్రీకమ్' అని నామకరణం చేశారు. ఈ చివరి పది మొక్కలను కాపాడటమే కాకుండా, వాటి సంఖ్యను మరింత పెంచేందుకు అటవీ శాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయడం పట్ల అభినందించారు. అదేవిధంగా, శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే, ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరిన ఈత చెట్టు మాదిరి ఉండే 'సైకాస్ శేషాచలన్సిస్' మొక్కల పెంపకానికి, వాటి సంరక్షణకు కూడా అటవీ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుందని తెలుసుకొని అభినందించారు. కార్యక్రమంలో అటవీ పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీ వినయ్ చంద్, పీసీసీఎఫ్ శ్రీ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు శ్రీ మల్లికార్జునరావు, సీసీఎఫ్ సోషల్ ఫారెస్ట్, జూలాజికల్ పార్క్స్ శ్రీ. బి.ఎన్.ఎన్. మూర్తి, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ శ్రీ ఎన్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో మార్పులు కావాలి

**అమరావతిజూన్ 18,(ప్రజావినికిడి):** తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు ,, స్కూళ్ల వల్ల సమాజంలో అసమనాతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు



సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.

--------------

## రాధాగాయత్రి మృతిపై తల్లి అనుమానం

### అల్లుడే హత్య చేసి ఉంటాడని ఆరోపణ


### లోతైన దర్యాప్తు చేస్తే నిజాలు వస్తాయని వెల్లడి



**విశాఖపట్నం,జూన్ 18,(ప్రజావినికిడి):** విశాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాధా గాయత్రి మృతి కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. భర్తతో కలిసి ఉత్తరాఖండ్ వెళ్లిన గాయత్రి అనుమానాస్పదస్థితిలో మరణించింది. గాయత్రి మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లి సత్యవతి.. దీనిపై విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తన అల్లుడు శ్రీచరణ్‌పైనే అనుమానం ఉందన్నారు. ఈ కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తే అనేక విషయాలు బయటపడతాయని తల్లి సత్యవతి చెప్పారు. 'నా కూతురి మృతి విషయంలో అల్లుడుపైనే అనుమానం. నా కూతురికి మద్యం సేవించే అలవాటు లేదు. గాయత్రిపై అనుమానంతోనే హత్య చేసి ఉండొచ్చు. రిషికేశ్, హరిద్వార్ వెళ్తున్నామని చివరిసారిగా నాకు చెప్పింది. విహారయాత్ర ముగించుకొని విశాఖకు వస్తానని చెప్పింది. విశాఖకు రాకుండానే నా కూతుర్ని హతమార్చారు. విశాఖకు వచ్చిన తర్వాత రెండు నెలలు వర్క్ ఫ్రం హోం పెట్టి ఇక్కడే ఉంటాను అని చెప్పింది. నా కూతురి విషయంలో మీడియా నాకు న్యాయం చేయాలి. మాది సాంప్రదాయమైన కుటుంబం అని తల్లి సత్యవతి ఆవేదన వ్యక్తం చేసింది.

## ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

**అమరావతిజూన్ 18,(ప్రజావినికిడి):** ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా తెలుసుకోవచ్చు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, అవసరమైన వివరాలు నమోదు చేసి ఫలితాలను




చెక్ చేసుకోవచ్చు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాల్లో 59 శాతం మంది, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 53 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెరుగైన ఫలితాలు పొందిన విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.


-------

## టిఎంసికి హైకోర్టులో ఎదురుదెబ్బ

### రితబ్రత బెనర్జీ నియామకంపై సవాల్

### మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు

**కోల్‌కతా,జూన్ 18,(ప్రజావినికిడి):**



తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు. కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృతమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ, ఆమె మేనల్లుడైన అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా ఓ చీలిక వర్గాన్ని ఏర్పాటు చేశారు రితబ్రత. అయితే.. తిరుగుబాటు వర్గం వాదనను అంగీకరిస్తూ రితబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ నియమించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. స్పీకర్ నిర్ణయం అధికారికంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీని పక్కనపెట్టిందని, శాసనసభ పార్టీల గుర్తింపును నియంత్రించే రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించిందని వాదిస్తూ.. దీదీ వర్గం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం

### పవన్ ఆదేశాలతో అటవీశాఖ ప్రత్యేక దృష్టి

**కాకినాడ,జూన్ 18,(ప్రజావినికిడి):**



తునిలో చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోజులు గడుస్తున్నా చిన్నారి జాడ లభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ, ప్రత్యేక హనుమాన్ టీమ్ సంయుక్తంగా థర్మల్ డ్రోన్ల సహాయంతో సెర్చింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. రాత్రి వేళల్లోనూ పాప కోసం విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. థర్మల్ డ్రోన్ల ద్వారా అటవీ జంతువుల కదలికలపైనా అధికారులు నిఘా పెట్టారు. చిన్నారిని అడవి జంతువులు ఎత్తుకెళ్లి ఉండవచ్చన్న అనుమానంతో.. ఆ కోణంలోనూ గాలింపు కొనసాగుతోంది. అటవీ ప్రాంతాల్లో జంతువుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారి జాడను కనిపెట్టడం కోసం పోలీసులు ఇప్పటికే రెండు బొమ్మలను వేలాడదీసి, వాటిలో మాంసం ఎరగా ఉంచారు. ఇప్పటివరకు ఎలాంటి జంతువుల జాడ కానరాకపోవడం గమనార్హం. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది. పాప క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

----

## ప్రతి హార్ట్ పేషెంట్ కు స్టెంట్ వేయాల్సిన అవసరం లేదు!


**స్టెంట్లు, బైపాస్ సర్జరీ సాధ్యం కాని గుండె రోగులకు ఈఈసీపీ ఒక ప్రత్యామ్నాయ చికిత్స**

**శరీరంలో సహజంగానే కొత్త రక్తనాళాలు ఏర్పడటానికి ఈ థెరపీ సహాయం**

**శస్త్రచికిత్స లేకుండా కాళ్లకు కఫ్స్ బిగించి చికిత్స**

**ఇది ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సురక్షితమైన చికిత్సా విధానం**

**ఛాతీ నొప్పి తగ్గి, గుండె పనితీరు మెరుగుపడే అవకాశం**



**జూన్ 18,(ప్రజావినికిడి):** గుండె జబ్బులతో బాధపడుతూ, స్టెంట్లు వేయడం లేదా బైపాస్ సర్జరీ చేయడం సాధ్యపడని రోగులలో 'ఎన్‌హాన్స్‌డ్ ఎక్స్‌టర్నల్ కౌంటర్‌పల్సేషన్' (ఈఈసీపీ) థెరపీ కొత్త ఆశలు చిగురింపజేస్తోంది. శస్త్రచికిత్స అవసరం లేని ఈ విధానం ద్వారా గుండెకు రక్త ప్రసరణను మెరుగుపరిచి, శరీరంలో సహజంగానే కొత్త రక్తనాళాలు (సహజ బైపాస్‌లు) ఏర్పడేలా ప్రోత్సహించవచ్చని వైద్య నిపుణులు వివరిస్తున్నారు.
టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం... తీవ్రమైన గుండెనొప్పితో బాధపడే రోగులకు ఈ చికిత్స ఒక వరమని చెప్పవచ్చు. సరైన మందులు, చికిత్సలు తీసుకున్నప్పటికీ ఛాతీ నొప్పి తగ్గని రోగులు ఎందరో ఉన్నారని బెంగళూరులోని ఆస్టర్ ఆర్వీ ఆసుపత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి. డింపు ఎడ్విన్ జోనాథన్ తెలిపారు. స్టెంట్లు లేదా శస్త్రచికిత్సలు నిర్వహించడానికి వీలులేని క్లిష్ట పరిస్థితుల్లో ఉన్ రోగులకు ఈఈసీపీ ఒక ప్రభావవంతమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

**చికిత్స ఎలా పనిచేస్తుంది?**

ఈఈసీపీ ప్రక్రియలో రోగి కాళ్లు, పిరుదుల భాగానికి ప్రత్యేకమైన కఫ్స్‌ను అమర్చి, వాటిని ఈసీజీ యంత్రానికి అనుసంధానిస్తారు. గుండె విశ్రాంతి తీసుకునే సమయంలో ఈ కఫ్స్ గాలితో నిండి, కాళ్ల నుంచి గుండెకు రక్త ప్రసరణను వేగవంతం చేస్తాయి. తిరిగి గుండె కొట్టుకునే సమయంలో ఆ గాలిని విడుదల చేయడం ద్వారా గుండెపై పని భారాన్ని తగ్గిస్తాయి. ఈ చికిత్సను ఏడు వారాల పాటు, వారానికి ఐదు రోజులు, రోజుకు ఒక గంట చొప్పున మొత్తం 35 సెషన్ల పాటు నిర్వహిస్తారు.
ఈ ప్రక్రియ వల్ల మూసుకుపోయిన ధమనుల చుట్టూ కొత్త రక్తనాళాలు అభివృద్ధి చెందుతాయని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ వంటి అంతర్జాతీయ వైద్య సంస్థలు వెల్లడించాయి. ఈ చికిత్స పొందిన సుమారు 30 నుంచి 50 శాతం మంది రోగులలో ఛాతీ నొప్పి తగ్గడంతో పాటు శారీరక శ్రమ చేసే సామర్థ్యం పెరిగినట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.
అమెరికాలోని ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ఈ సురక్షితమైన చికిత్సను గర్భిణులు, తీవ్రమైన అధిక రక్తపోటు ఉన్నవారు మాత్రం వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది స్టెంట్లు లేదా బైపాస్ సర్జరీకి పూర్తి ప్రత్యామ్నాయం కానప్పటికీ, ఇతర చికిత్సా మార్గాలు లేని 'నో-ఆప్షన్' రోగులకు ఇది ఒక అద్భుతమైన పరిష్కారం.

## తమిళనాట అనూహ్య రాజకీయ పరిణామాలు

### సిఎం విజయ్‌తో వైకో భేటీతో ఊహాగానాలు -డిఎంకెను వీడుతారన్న ప్రచారం

**చెన్నై,జూన్ 18,(ప్రజావినికిడి):** తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.
తన స్థానాన్ని పదిలం చేసుకునే దిశగా సిఎం విజయ్ అడుగులు వేస్తున్నారు. ద్రవిడ పార్టీలు కలిసినా తన మనుగడకు ఢోకా లేకుండా చేసుకుంటున్నారు. అందుకే అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు ఒక్కరొక్కరుగా రాజీనామా చేసి, టివికెలో చేరుతున్నారు. వీరంతా మళ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది. దీంతో అన్నా డిఎంకె కూడా పూర్తిగా బలహీనపడే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వైకో సిఎంతో భేటీ కావడం మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. డీఎంకేతో కలిసి పనిచేసిన పలువురు మాజీ మిత్రపక్షాలు ఇప్పటికే టీవీకే ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి. కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు అధికార వ్యవస్థలో భాగస్వాములయ్యాయి. మరోవైపు సీపీఐ, సీపీఎం పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండీఎంకే వైఖరి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. యితే.. ఈ ఊహాగానాలపై వైకో అప్రమత్తంగా వ్యవహస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలను సాధారణ మండలి ఆధ్వర్యంలోనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సీఎం విజయ్‌తో సమావేశం పూర్తిగా ప్రజా సమస్యలపైనే జరిగిందని పేర్కొన్నారు. తూత్తుకుడిలో వేదాంత గ్రూప్‌నకు అనుబంధంగా మరో రాగి పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాంటి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరానని వెల్లడించారు.

# ఐపీఎల్ 2027 సీజన్‌ను ముందుకు జరిపే ఛాన్స్

**మార్చి 10 నుంచి మే 15 వరకు ముగింపు**

**అవకాశాలు పరిశీలిస్తున్న బిసిసిఐ**



**ముంబై,జూన్ 18:** వచ్చే ఐపీఎల్ సీజన్‌కు సంబంధించి కీలక విషయాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ఐపీఎల్ 2027 సీజన్‌ను మార్చి 10 నుంచి మే 15 వరకు నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మ్యాచుల సంఖ్య పెంపు విషయంలో ప్రస్తుతం ఎలాంటి చర్చ జరగలేదని పేర్కొన్నారు. తాజా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత వల్ల ఐపీఎల్ 20వ సీజన్‌ను ఇంకాస్త ముందుగా నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. 'ఈ సంవత్సరం ఐపీఎల్ సీజన్ మార్చి 28 నుంచి మొదలై మే 31న ముగిసింది. మే 15 తర్వాత టోర్నీ కీలక దశకు చేరుకుంది. ఇలాంటప్పుడు పలుచోట్ల వర్షాలు పడే అవకాశమూ ఉంది. ఇక ఎండల తీవ్రత కూడా కొన్ని ప్రాంతాల్లో ఆందోళన కలిగించే అంశమే. ఇటు ప్లేయర్లతోపాటు అటు ప్రేక్షకులూ ఆటను ఆస్వాదించేందుకు ఇబ్బంది అవుతుంది. ఈక్రమంలో ఐపీఎల్ గవర్నింగ్ బాడీతో బీసీసీఐ చర్చలు జరుపుతోంది. లీగ్‌ను ఇంకాస్త ముందుగానే ప్రారంభిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నాం. వచ్చే సీజన్ కోసం మార్చి 10 నుంచి మే 15 వరకు విండోను ఉంచాం. ప్లేఆఫ్స్, ఫైనల్‌కు వాతావరణం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనేదే మా ఉద్దేశం. ఎండల తీవ్రత గురించి మాకు అభిమానుల నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయి. ఇటు ఆటగాళ్లూ ఇబ్బందులు పడ్డారు. కాబట్టి వారందరికీ మంచి వాతావరణం అందించాల్సిన బాధ్యత మాపై ఉందని సైకియా తెలిపారు. ఇకపోతే ఇప్పటికిప్పుడు మ్యాచుల సంఖ్య పెంపు విషయంలో నిర్ణయం తీసుకోలేం. చాలా అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. వివిధ దేశాల నుంచి ఆటగాళ్లు వస్తారు. దీనికోసం దాదాపు రెండు నెలల పాటు షెడ్యూల్‌ను కేటాయించాల్సి ఉంటుంది. కొందరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటం కష్టమవుతోంది. ఇతర దేశాలకూ ద్వైపాక్షిక సిరీస్‌లూ ఉంటాయి. మ్యాచుల సంఖ్యను 74 నుంచి 94కు పెంచడంపై చర్చ జరగలేదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందోఇప్పుడేచెప్పలేమని దేవజిత్ సైకియా వెల్లడించారు.




# వైభవ్ సూర్యవంశీకి బిసిసిఐ ఆఫర్

**- తల్లిదండ్రులతో ఇంగ్లడ్ పర్యటనకు అనుమతి**

**ముంబై,జూన్ 18:** భారత క్రికెట్‌లో నయా సంచలనంగా ఎదుగుతున్న వైభవ్ సూర్యవంశీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపికైన ఈ యువ బ్యాటర్‌తో పాటు అతడి తల్లిదండ్రులనూ అనుమంతించింది. వారి ప్రయాణ, వసతి ఖర్చులన్నింటినీ తామే భరిస్తామని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న వైభవ్.. సీనియర్ ఆటగాళ్ల మధ్య సౌకర్యంగా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామ న్నారు. 'జాతీయ జట్టులో 14-15 ఏళ్ల ఆటగాడు ఉండటం చాలా అరుదు. గతంలో సచిన్ టెండూల్కర్ లాంటి ఆటగాడు చిన్న వయసులోనే భారత జట్టులోకి వచ్చాడు. ఇప్పుడు వైభవ్ కూడా అలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాడు. అక్కడి కొత్త వాతావరణ పరిస్థితులకు అతడు అలవాటుపడేందుకు తల్లిదండ్రుల సాన్నిహిత్యం ఉపయోగపడుతుంది' అని సైకియా వివరించారు. ఐపీఎల్ సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన వైభవ్.. 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 237కు పైగా స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసి మోస్ట్ వ్యాల్యూబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులనూ సొంతం చేసుకున్నాడీ చిచ్చర పిడుగు. అతడి అద్భుత ఆటతీరును గుర్తించిన బీసీసీఐ.. భారత టీ20 జట్టులో అవకాశం కల్పించింది. కాగా.. దీనికంటే ముందు శ్రీలంకలో ప్రస్తుతం జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు వైభవ్.

# వన్డే ప్రపంచ కప్‌లో ఇషాన్‌కు చోటు ఖాయం

**- సునీల్ గవాస్కర్ ఆశాభావం**

**ముంబై,జూన్ 18:** సౌతాఫ్రికా వేదికగా జరిగే 2027 వన్డే ప్రపంచ కప్ జట్టులో ఇషాన్ కిషన్ కచ్చితంగా చోటు దక్కించుకుంటాడని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఇషాన్‌ను ఇప్పుడు జట్టు నుంచి తప్పించడం దాదాపు అసాధ్యమని పేర్కొన్నారు. ప్రపంచ కప్‌నకు ఎంపిక కావడానికి ఇప్పటికే సరిపడా ప్రదర్శనను అతను చేశాడని చెప్పారు. 'ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా వచ్చి ఉంటుందని నాకనిపిస్తోంది. అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో అతడు జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చాలా బాగా బ్యాటింగ్ చేస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారాడు' అని గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. అతడు నిజమైన టీమ్ మ్యాన్. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయమని అడిగితే మొదటి మ్యాచ్‌లోలాగే విలువైన ఇన్నింగ్స్ ఆడతాడు. రెండో వన్డేలో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ అద్భుతమైన దూకుడు ప్రదర్శించాడు. భారత జట్టు జెర్సీ ధరించి ఆడుతున్నంత కాలం ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడనే దానితో సంబంధం ఉండదు. అది చాలా మంచి విషయం. ఎక్స్‌ట్రా కవర్ మీదుగా




అతను కొట్టిన షాట్లు నాకు ఎంతగానో నచ్చాయని గ్రేమ్ స్వాన్ పేర్కొన్నాడు. అఎ÷-గానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. అర్థ శతకానికి 52 బంతులు తీసుకున్న అతను.. తర్వాత రెచ్చిపోయాడు. మరో 19 బంతులకే సెంచరీ మార్కును అందుకున్నాడు.

# ఫిఫా ప్రపంచకప్ 2026లో పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్

**● ఆధిక్యతను అడ్డుకున్న కాంగో జట్టు**



**న్యూఢిల్లీ,జూన్ 18:** ఫిఫా ప్రపంచకప్ 2026లో బలమైన పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. హ్యూస్టన్‌లోని ఎన్ఆర్జీ స్టేడియంలో జరిగిన గ్రూప్-కె మ్యాచ్‌లో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో(డీఆర్ కాంగో) జట్టు 1-1తో పోర్చుగల్‌ను నిలువరించింది. మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, కాంగో పటిష్ఠ రక్షణ శ్రేణిని ఛేదించడంలో పోర్చుగల్ విఫలమైంది. మ్యాచ్ ప్రారంభమైన 6వ నిమిషంలోనే పోర్చుగల్ ఆటగాడు జోనో నెవ్స్ అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, డిఫెండర్ విభాగాన్ని పటిష్ఠం చేసుకున్న కాంగో ఎదురుదాడికి దిగింది. ఈ క్రమంలో 44వ నిమిషంలో కాంగో స్టార్ యోనే విస్సా హెడర్ ద్వారా బంతిని నెట్‌లోకి పంపి స్కోరును 1-1తో సమం చేశాడు. రెండో అర్థ భాగంలో పోర్చుగల్ బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకున్నప్పటికీ గోల్స్ చేయలేకపోయింది. ఈ మ్యాచ్ లో కాంగోపై గోల్‌తో పోర్చుగల్ యువ మిడ్‌ఫీల్డర్ జోవా నెవిస్ అరుదైన ఘనత సాధించాడు. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో గోల్ చేసిన మూడో అతి పిన్న వయస్కుడైన పోర్చుగీస్ ప్లేయర్‌గా నిలిచాడు. అతడు 21 ఏళ్ల 263 రోజుల వయసులో ఈ ఘనత సాధించాడు. అతడి కంటే ముందు ఈ జాబితాలో దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో(2006), రామోస్ (2022) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. మరోవైపు పోర్చుగల్ స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో ఈ మ్యాచ్‌లో పూర్తిగా నిరాశపరిచాడు. కాంగో డిఫెండర్లు అతడిని గట్టిగా మార్క్ చేయడంతో రొనాల్డోకు గోల్ చేసే అవకాశాలు దక్కలేదు. ఈ పేలవ ప్రదర్శనపై రొనాల్డో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. 'మేము అనుకున్న ఆరంభం ఇది కాదు. కానీ ఇక్కడితో అంతా అయిపోలేదు. తల ఎత్తి తదుపరి మ్యాచ్‌పై దృష్టి పెడతాం' అంటూ అభిమానుల్లో నమ్మకాన్ని నింపాడు. మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. గ్రూప్-ఎల్‌లో జరిగిన ఉత్కంఠభరిత పోరులో క్రొయేషియాపై 4-2తో విజయం సాధించింది. స్టార్ స్ట్రైకర్ హ్యారీ కేన్ రెండు గోల్స్‌తో మెరిసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# బీహార్‌లో మరో చిచ్చర పిడుగు

**● క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన అక్షరగుప్తా**




**పాట్నా,జూన్ 18:** వైభవ్ సూర్యవంశీ 13 ఏళ్లకే ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకుని క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశాడు. బిహార్‌కు చెందిన ఈ కుర్రాడు రాజస్థాన్ రాయల్స్ తరఫున గత రెండు సీజన్లలో పరుగుల వరద పారించి ఎన్నో రికార్డులు బ్రేక్ చేశాడు. ఈ ప్రదర్శనతో భారత టీ20 జట్టులోనూ చోటు సంపాదించుకున్నాడు. ఇప్పుడు అదే రాష్ట్రం నుంచి మరో టీనేజీ సంచలనం వెలుగులోకి వచ్చింది. అక్షర గుప్తా అనే అమ్మాయి ఓ మ్యాచ్‌లో 126 బంతుల్లోనే 242.86 స్ట్రయిక్ రేట్‌తో 306 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ, 34 బంతుల్లో సెంచరీ చేసింది. మొత్తం 55 ఫోర్లు, ఎనిమిది సిక్సర్లు బాది వార్తల్లో నిలిచింది. బిహార్ క్రికెట్ అసోసియేషన్ మహిళల అండర్-19 వన్డే ట్రోఫీ టోర్నమెంట్‌లో అక్షర గుప్తా ఈ సంచలన ఇన్నింగ్స్ నమోదు చేసింది. 15 ఏళ్ల అక్షర తూర్పు చంపారన్ జిల్లా రక్సౌల్ అనే పట్టణంలో పుట్టి పెరిగింది. 14 ఏళ్ల వయసులోనే అండర్-19 మహిళల జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. బిహార్ తరఫున రెండేళ్ల వ్యవధిలో వరుసగా నాలుగు బీసీసీఐ మహిళా టోర్నమెంట్లు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. సంచలన ఇన్నింగ్స్ ఆడిన అక్షరకు బిహార్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ అభినందనలు తెలిపారు. బిహార్ మహిళా క్రికెటర్లు తమ ప్రదర్శనల ద్వారా రాష్ట్రానికి నిరంతరం కీర్తిని తెస్తున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు బీసీఏ నిరంతరం కృషి చేస్తోందని, ఇలాంటి ఇన్నింగ్స్‌లు యువ క్రికెటర్లకు స్ఫూర్తినిస్తాయన్నారు.

# టీజీ20 లీగ్‌కు ప్రచారం..

**● సిరాజ్, తిలక్ వర్మ, విజయ్ దేవరకొండకు నోటీసులు..!**




భారత క్రికెటర్లు సిరాజ్, తిలక్ వర్మ, సినీ హీరో విజయ్ దేవరకొండకు తెలంగాణ క్రికెట్ సంఘం నోటీసులు పంపింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ టీ20 లీగ్(టీజీ20)కు ప్రచారం కల్పిస్తున్నారనే ఆరోపణలతో వీరికి లీగల్ నోటీసులు జారీ చేసింది. క్రికెటర్లతో పాటు పలువురు సినీ తారలకు నోటీసులు పంపామని టీసీఏ జనరల్ సెక్రటరీ గురవా రెడ్డి వెల్లడించాడు.భారత క్రికెట్ నియంత్రణ మండలి అనుమతి లేని టీజీ20కి ప్రచారం చేయడం అక్రమమని పేర్కొన్న టీసీఏ చర్యలకు ఉపక్రమించింది. టీసీఏ నుంచి నోటీసులు అందుకున్న వారిలో క్రికెటర్లు సిరాజ్, తిలక్‌తో పాటు మాజీ ఆటగాడు అంబటి రాయుడు, టాలీవుడ్ హీరోలు విజయ్ దేవరకొండ, వెంకటేశ్ దగ్గుబాటిలు ఉన్నారు.




# వెంకీ-కల్యాణ్ రామ్ మల్టీస్టారర్..

## అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్ గ్రాండ్ లాంచ్

టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తి రేపుతున్న భారీ మల్టీస్టారర్ చిత్రానికి ఈరోజు అధికారికంగా అంకురార్పణ జరిగింది. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు, నిర్మాత అల్లు అరవింద్ వంటి సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ సినిమాలో కథానాయికల వివరాలను కూడా చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. వెంకీ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి నటించనుంది. దగ్గుబాటి, నందమూరి హీరోల కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్ర నిర్మాణంలో సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంస్థలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. జాతీయ అవార్డు విజేత జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

# విజయ్ కేవలం స్క్రీన్ హీరో మాత్రమే కాదు: సమంత ప్రశంసలు

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నటుడు జోసెఫ్ విజయ్‌ను ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు బుధవారం చెన్నైలో కలిశారు. విజయ్ కేవలం వెండితెరకే పరిమితమయ్యే కథానాయకుడు కాదని, అంతకుమించిన గొప్ప బాధ్యతలను నిర్వర్తించేందుకే ఆయన జన్మించారని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయపడ్డారు. ఈ భేటీ అనంతరం ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్టును పంచుకున్నారు. "చెన్నైలో అడుగుపెట్టగానే ఈరోజు అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. మన ముఖ్యమంత్రిని కలవబోతున్నానన్న ఆలోచన ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. విజయ్ సార్ కేవలం వెండితెర హీరోగా మాత్రమే ఉండాల్సిన వ్యక్తి కాదని నాకు ఎప్పుడూ అనిపిస్తుండేది. ఆయనకున్న ప్రజాబలం, ప్రజలు ఆయన పట్ల చూపే ఆదరణ చూస్తుంటే, ఆయన ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన వ్యక్తి అని నా నమ్మకం" అని సమంత తన పోస్టులో పేర్కొన్నారు. అత్యున్నత స్థాయిలో ఉన్న సినీ కెరీర్‌ను వదులుకుని, ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టడం సామాన్యమైన విషయం కాదని, అందుకు ఎంతో ధైర్యం కావాలని ఆమె కొనియాడారు. "అటువంటి సవాలును స్వీకరించే సాహసం కొందరికే ఉంటుంది. తనను నమ్మిన వారి అంచనాలను ఆయన కచ్చితంగా అధిగమిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆమె తెలిపారు. ఈ నూతన ప్రయాణంలో విజయ్‌కు సంపూర్ణ శక్తి, వివేకం, ధైర్యం చేకూరాలని ఆమె ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ మొత్తం 234 స్థానాలకు గాను 108 సీట్లను సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ క్రమంలోనే ఆయన మే 10న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో 2016లో విడుదలైన 'తెరి' చిత్రంలో విజయ్, సమంత కలిసి నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సమంత, నందిని రెడ్డి దర్శకత్వంలో 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటిస్తున్నారు.





# నేటి నుంచి 'పెద్ది'లో మరో ఆరు నిమిషాల కొత్త సన్నివేశాలు

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రంలో కీలక మార్పులు చేశారు. విడుదలై రెండు వారాలు పూర్తయిన నేపథ్యంలో ప్రేక్షకులకు మరింత మెరుగైన అనుభూతి కల్పించేందుకు చిత్రంలో కొత్త సన్నివేశాలను జోడిస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. గురువారం నుంచి థియేటర్లలో ప్రదర్శించే వెర్షన్‌లో అదనంగా 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల కొత్త ఫుటేజీని చేర్చనున్నారు. దీంతో సినిమా నిడివి మరింత పెరగనుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. కొత్త సన్నివేశాలతో 'పెద్ది' అనుభూతి మరింత మెరుగవుతుందని పేర్కొంది.

ఇటీవల జాన్వీ కపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రం నుంచి తొలగించారనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో కొత్త ఫుటేజీని జోడించడం ఆసక్తికరంగా మారింది. అయితే కొత్తగా చేర్చిన సన్నివేశాల్లో ఏమి ఉంటాయనే విషయాన్ని నిర్మాతలు వెల్లడించలేదు. మరోవైపు, గురువారం నుంచి ఈ చిత్రాన్ని సాధారణ టికెట్ ధరలతో ప్రదర్శించనున్నారు. దీంతో ప్రేక్షకుల ఆదరణ మరింత పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. జూన్ 4న విడుదలైన 'పెద్ది'కి తొలి రోజుల్లో మంచి స్పందన లభించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో ఈ చిత్రం బలమైన వసూళ్లు సాధించింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం 14వ రోజున దేశవ్యాప్తంగా రూ.2.45 కోట్ల నికర వసూళ్లు రాబట్టిన ఈ సినిమా మొత్తం ఇండియా నెట్ కలెక్షన్లు రూ.226 కోట్లకు చేరాయి. గ్రాస్ వసూళ్లు రూ.267 కోట్లకు పైగా నమోదైనట్లు సమాచారం. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందన మధ్య ప్రదర్శితమవుతున్న ఈ చిత్రానికి కొత్త సన్నివేశాలు ఎంతవరకు కలిసివస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.



# ఫేడౌట్ అనుకుంటే బౌన్స్ బ్యాక్..

టాలీవుడ్ లో హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ ఎప్పుడు ఎలా మారుతుందో అంచనా వేయడం చాలా కష్టం. ఒకట్రెండు ఫ్లాపులు పడినా లేదా కాస్త గ్యాప్ వచ్చినా ఇక ఫేడౌట్ అయిపోయారని ఈజీగా డిసైడ్ చేసేస్తారు. టాలెంటెడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ విషయంలో కూడా రీసెంట్ గా ఇలాంటి కామెంట్స్ గట్టిగానే వినిపించాయి. తెలుగులో ఆమెకు అవకాశాలు దాదాపు తగ్గిపోయాయనే టాక్ నడుస్తున్న టైమ్ లో.. సడెన్ గా రెండు భారీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టి ఇండస్ట్రీకి పెద్ద షాక్ ఇచ్చింది. గతంలో మెంటల్ మదిలో, చిత్రలహరి, బ్రోచేవారెవరురా, అల వైకుంఠపురములో లాంటి సక్సెస్ ఫుల్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ కు ఆ తర్వాత ఆశించిన స్థాయిలో సరైన బ్రేక్ రాలేదు. ఆమె కెరీర్ పూర్తిగా స్లో అయిపోయినట్లే అనిపించింది. రీసెంట్ గా వచ్చిన సింగ్ గీతం సినిమాలో కూడా ఆమె కేవలం ఒక చిన్న క్యామియో రోల్ కే పరిమితం అయింది. దీంతో ఆల్మోస్ట్ ఆమె కెరీర్ గ్రాఫ్ పడిపోయిందా అనేలా కామెంట్స్ వచ్చాయి. కానీ ఆమె ప్లానింగ్ వేరేలా ఉంది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో రాబోతున్న ఆదర్శ కుటుంబం సినిమాలో నివేదా ఒక క్రేజీ ఛాన్స్ దక్కించుకుని అందరి దృష్టి తనవైపు తిప్పుకుంది. త్రివిక్రమ్ సినిమాల్లో లేడీ క్యారెక్టర్స్ కు ఎంత ఇంపార్టెన్స్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ప్రాజెక్ట్ లో ఆమె రోల్ చాలా పవర్ ఫుల్ గా, సెకండ్ హాఫ్ లో కథను మలుపు తిప్పేలా ఉండబోతోందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.




# తిరుమల కొండపై సందడి చేసిన 'మా ఇంటి బంగారం' టీమ్



స్టార్ హీరోయిన్ సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమైన వేళ, చిత్ర బృందం తిరుమల శ్రీవారి ఆశీస్సులు తీసుకుంది. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో చిత్ర యూనిట్ సభ్యులు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నటి సమంత, ఆమె భర్త, చిత్ర నిర్మాత అయిన రాజ్ నిడిమోరు, దర్శకురాలు నందిని రెడ్డి, నటి-యాంకర్ శ్రీముఖి తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న చిత్ర బృందానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నందిని రెడ్డి దర్శకత్వంలో ఫ్యామిలీ యాక్షన్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం రేపు జూన్ 19న (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సినిమా విడుదలకు ఒక్కరోజు ముందు చిత్ర విజయం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్, ప్రమోషన్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి.

# 'డ్రాగన్'లో నీల్ నెక్స్ట్ లెవెల్ ప్లాన్.. ఫ్యాన్స్‌కు ఫుల్ ఫీస్ట్!

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, కేజీఎఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్యాన్-ఇండియా మూవీ 'డ్రాగన్'. ఇటీవలే ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా వచ్చిన గ్లిమ్స్ సోషల్ మీడియాను ఎలా షేక్ చేసిందో మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా తాజాగా ఈ మూవీ నెక్స్ట్ షెడ్యూల్‌కు సంబంధించి ఒక మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ క్రేజీ న్యూస్ విన్న నందమూరి ఫ్యాన్స్ ఇప్పుడే థియేటర్లలో పూనకాలు గ్యారెంటీ అని ఫిక్స్ అయిపోతున్నారు. ఆ విశేషాలు చూద్దాం..

**శ్రీలంక కొండల్లో హై-ఓల్టేజ్ యాక్షన్:**

ప్రస్తుతం డ్రాగన్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఇక టీమ్ ముఖ్యమైన సీన్లు షూట్ చేస్తున్నారు. డ్రాగన్ తదుపరి భారీ షెడ్యూల్ కోసం చిత్ర యూనిట్ మొత్తం శ్రీలంకకు పయనం కానుంది. ప్రశాంత్ నీల్ మార్క్ యాక్షన్ సీన్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలుసు. ఇక శ్రీలంకలోని అద్భుతమైన, కనువిందు చేసే లొకేషన్లలో ఎన్టీఆర్‌పై కొన్ని మైండ్ బ్లాంక్ అయ్యే హై-ఓల్టేజ్ యాక్షన్ సీన్లను ప్లాన్ చేశారు నీల్. వచ్చే నెలలో ప్రారంభం కాబోయే ఈ భారీ షెడ్యూల్‌తో సినిమాకు సంబంధించిన ఒక మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ అవ్వబోతోందని సమాచారం.: ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ క్రష్, బ్యూటిఫుల్ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే బాలీవుడ్ ఎవర్‌గ్రీన్ స్టార్ అనిల్ కపూర్, మలయాళ వర్సటైల్ యాక్టర్ బిజూ మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ భారీ క్యాస్టింగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచేస్తోంది. ఈ చిత్రానికి కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్ మరియు మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613